క్లుప్తంగా

అలరించిన చిన్నారుల త్యాగరాజ ఆరాధన



త్యాగరాజ కృతులు ఆలపిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం : త్యాగరాజ స్వామి వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా కళాభారతిలో మూడో రోజు ఆదివారం ఆరేళ్ల నుంచి పదేళ్ల లోపు చిన్నారులు త్యాగరాజ కృతులను ఆలపించి అందరి హృదయాలు దోచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ రాంబాబు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పంతుల గోపాలరావు, మేనేజర్ మోహన్ దాస్ ప్రారంభించారు. అనంతరం 11 మంది చిన్నారులు త్యాగరాజ కృతుల ఆలాపనతో ఓలలాడించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇంత చిన్న వయసులో అద్భుతంగా పాడిన చిన్నారులు భవిష్యత్‌లో గొప్ప సంగీత కళాకారులవుతారన్నారు. అనంతరం కచేరీలో డాక్టర్ ద్వారం త్యాగరాజు, కాశీ ప్రసాద్ వేణువు, లలిత చంద్రశేఖర్ గాత్రం, సుశారావు లక్ష్మి గణపతి వయోలిన్, సరస్వతి విద్యార్థి గాత్ర కచేరీ అలరించాయి.

పప్పు దోసకాయలకు గిరాకీ



రైతుబజార్‌లో విక్రయిస్తున్న దోసకాయలు

సీతమ్మధార : సీతమ్మధార రైతు బజారులో పప్పు దోసకాయలకు గిరాకీ పెరిగింది. ఈ దోసకాయలు విభిన్న రంగుల్లో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ కాయలను కిలో రూ.35 వంతున విక్రయిస్తున్నారు. పెందుర్తి మండలం చింతగట్లకు చెందిన రైతు ముత్యాలమ్మ సీతమ్మధారలో గల రైతు బజార్లో విక్రయిస్తున్నారు. ఈ బజారులో దోసకాయల రైతులు అందరూ కలిపి రోజుకి సుమారుగా 50 కిలోల వరకు సరకు విక్రయిస్తున్నారని సిబ్బంది తెలిపారు. వంటలో పప్పుతో కలిపి దోసకాయ వినియోగించడం తెలిసిందే. వినియోగదారులు అధిక సంఖ్యలో పప్పు దోసకాయలను కొనుగోలు చేశారు.

యోగి వేమనకు ఘన నివాళి

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్క్ ఆవరణలోని యోగి వేమన విగ్రహానికి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్ పెద్దలు వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.

హార్బర్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



హార్బర్‌లో బోట్ల వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. జనవరి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్‌ను నిషేధించాలని అధికార యంత్రాంగం పిలుపునిచ్చింది. కాని ఫిషింగ్ హార్బర్‌లో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారాలు కనబడుతున్నాయి. జెట్టీలో ఉన్న మరబోట్ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. చేపలు వేటాడిన తర్వాత వ్యర్థాలు, ఇతర సామగ్రిని సముద్రంలో పడేస్తున్నారు. సముద్రంలో వదిలేసిన వ్యర్థాలు ఒడ్డుకు చేరుకుంటున్నాయి.

కిలకిలరావాలతో కనువిందు

జూలో అరుదైన పక్షులు



ఆఫ్రికన్ గ్రే ప్యారెట్



స్కార్లెట్ మకావ్



గోఫిన్స్ కాకటూ



మిలటరీ మకావ్



గ్రీన్ వింగ్డ్ మకావ్

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అరుదైన పక్షులు ఉన్నాయి. ఇవి వాటి రంగులు, కిలకిలరావాలతో సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. వివిధ రకాల అరుపులతో వీనుల విందు చేస్తున్నాయి. ఎన్నో రంగులతో కనువిందు చేస్తున్నాయి. జూ అధికారులు కొన్నాళ్ల క్రితం ఇక్కడ తెల్ల పులులు, సింహాల ఎన్‌క్లోజర్ల మధ్యలో ప్రత్యేకంగా ఆఫ్రికన్ పక్షుల జోన్ ఏర్పాటు చేశారు. గతంలో అక్కడ ఇనుప మెస్‌లతో ఉండే పక్షుల పాత గూళ్లను గత ఏడాది తొలగించారు. వాటిని ఆధునీకరించి కొత్తదనం తీసుకొచ్చారు. పాత గూళ్లకు బదులుగా అద్దాలు అమర్చారు. ఎన్‌క్లోజరులో ఉండే పక్షులు సందర్శకులకు స్పష్టంగా కనిపించే విధంగా తయారు చేశారు. దానికి ఆఫ్రికన్ పక్షుల జోన్‌గా నామకరణం చేశారు.

జోన్‌లో 10 రకాల పక్షులు

ఈ జోన్‌లో 10 రకాల పక్షులు ఉన్నాయి. ఒక్కో రకం పక్షులకు ఒక్కో అద్దాల ఎన్‌క్లోజరు ఏర్పాటు చేశారు. అవన్నీ వరుసగా ఈ జోన్‌లో కనిపిస్తాయి. ఇక్కడ స్కార్లెట్ మకావ్, బ్లూ అండ్ గోల్డ్ మకావ్, గ్రీన్ వింగ్డ్ మకావ్, ఆఫ్రికన్ గ్రే ప్యారెట్, ఎలెక్టస్ ప్యారెట్, గొఫిన్స్ కాకటూ, మిలటరీ మకావ్, జెండే కానూర్, సల్ఫర్ క్రెస్టెల్ కాకటూ, లుటినో ప్యారెట్ ఉన్నాయి. ఇవన్నీ వివిధ రంగులతో కనిపిస్తాయి. ఇవన్నీ వివిధ దేశాల్లో సంచరిస్తుంటాయి. వీటిని దేశంలోని వివిధ జూ పార్కుల నుంచి ఇక్కడకు అధికారులు తీసుకొచ్చారు. వీటిని సందర్శకులు తిలకించి ఆనందిస్తున్నారు.



ఎలెక్టస్ ప్యారెట్



లుటినో ప్యారెట్



సల్ఫర్ క్రెస్టెల్ కాకటూ



బ్లూ అండ్ గోల్డ్ మకావ్

ములాఖత్‌కు నిబంధనలు పాటించాలి

ఆరిలోవ : కారాగారంలో ఖైదీలను కలవడానికి ములాఖత్ కోసం వెళ్లే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జైల్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖ కేంద్ర కారాగారం అధికారులు నియమ నిబంధనలతో కూడిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. లోపల ఉన్న ఖైదీలకు నిషేధిత వస్తువులు అందించకూడదని అందులో పేర్కొన్నారు. ఇంకా ఏం చెప్పారంటే...

- కేంద్ర హోం శాఖ నిబంధనల ప్రకారం ఖైదీని కలవడానికి ములాఖత్ కోసం వెళ్లే వారు ఆధార్ కార్డు చూపించాలి. దరఖాస్తుకు ఆధార్ కార్డు జెరాక్స్ జత చేయాలి.
- ఒక ముద్దాయితో మాట్లాడడానికి చిన్న పిల్లలకు మినహా ఒకసారి ముగ్గురికి మాత్రమే అవకాశం ఉంటుంది.
- వారానికి రెండుసార్లు మాత్రమే ములాఖత్ ఉంటుంది.
- ముద్దాయితో మాట్లాడుతున్న సమయంలో ములాఖత్‌కు వెళ్లే వారి వద్ద ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండకూడదు.
- ఖైదీలకు నేరుగా నగదు ఇవ్వకూడదు. జైల్ గేటు వద్ద సిబ్బందికి డబ్బులు ఇస్తే ఆ ఖైదీ ఖాతాలో జమ చేస్తారు.
- గంజాయి, ఖైనీ, బీడీలు, సిగిరెట్లు తదితర నిషేధిత వస్తువులు ముద్దాయిలకు ఇవ్వకూడదు.



కేంద్ర కారాగారం ద్వారం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నిషేధిత వస్తువులు జైలు లోపలకు వెళ్లనీయకుండా చర్యలు చేపడుతున్నామని జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా ఖైదీలను కలవడానికి ములాఖత్ కోసం వచ్చిన వారి బంధువులు, స్నేహితులు నిషేధిత వస్తువులు ఇవ్వకూడదని తెలియజేస్తూ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. బయట నుంచి లోపలకు గంజాయి, బీడీలు, ఖైనీ తదితర వస్తువులు వెళ్లకుండా ఖైదీల బేరక్‌ల వద్ద కూడా నిఘా పెట్టినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా ప్రతీ క్షణం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

రోడ్డు మధ్యలో పశువులు



రాకపోకలకు అడ్డంగా రోడ్డు మధ్యలో నిలిచిన పశువులు

ఏయూ క్యాంపస్ : రహదారి మధ్యలో రెండు పశువులు ప్రమాదకరంగా నిలిచాయి. వాటిని తప్పించుకుని ముందుకు సాగేందుకు అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యం పెదవాల్తేరు నుంచి సిరిపురం వెళ్లే మార్గంలో దర్శనమిచ్చింది. నిత్యం రద్దీగా ఉండే రూరల్ ఎస్పీ కార్యాలయం చేరువలో ఇలా రోడ్డుపై ఇష్టారాజ్యంగా పశువులు సంచరిస్తున్నాయి. ఇవి తమపై దాడి చేస్తాయనే భయంతో ప్రజలు అటువైపు వెళ్లడానికి భయపడ్డారు. పశువులను పెంచే వారు ఇష్టారాజ్యంగా వీటిని రోడ్డు మీదకి వదిలేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సంబంధిత అధికారులూ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు అభినందనలు

ఆరిలోవ : వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. దీంతో అమర్‌నాథ్ ఆనందం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ కె.ఆర్.పాత్రుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివ రామకృష్ణ, పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, దేవర మార్కెండేయులు, బొండా శ్రీనివాసరావు, ముప్పల సురేష్, అక్కరమాని మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



అమర్‌నాథ్‌ను సత్కరించి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేమన పద్యాలు జీవన సత్యాలు

ఏయూ క్యాంపస్ : వేమన పద్యాలు నిత్య జీవన సత్యాలని పలువురు వక్తలు అన్నారు. బీచ్‌రోడ్డులో యోగి వేమన విగ్రహం వద్ద శ్రీ వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా యోగి వేమన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు వారి నాలుకపై వేమన పద్యాలు నిత్యం వినిపిస్తాయన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వేమన పద్యాలను పఠించడం, వల్లించడం దినచర్యలో భాగంగా మారిపోయిందన్నారు. సామాజిక చైతన్యానికి, దురాచారాలను రూపుమాపడానికి ఆయన రచనలు దోహదపడ్డాయన్నారు. వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు గుడిమెట్ల మధుకుమార్ మాట్లాడుతూ విశ్వదాభిరామ వినుర వేమ పద్యం చదవని వారు, వినని తెలుగు వారు ఉండరన్నారు. సంఘం అధ్యక్షుడు గౌరుసు మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ పామరులకు సైతం అర్థమయ్యే విధంగా వేమన పద్యాలు ఉంటాయన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు సరళంగా, లోతైన భావాలతో ఉంటాయన్నారు. ప్రతీ వ్యక్తి జీవితానికి వేమన పద్యాలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పరవస్తు ఫణిశయిన సూరి వేమన శతకాన్ని చదివి వినిపించగా, రచయిత్రి సుజాత మూర్తి కార్యక్రమాన్ని నడిపించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సత్తి నాగేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, నాయకులు కొయ్య ప్రసాద రెడ్డి, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, కాలయ సూరా రెడ్డి, ఆచార్య తిమ్మ రెడ్డి, తాత రెడ్డి, డి.నారాయణ రెడ్డి, సీలాపు వివేకానంద రెడ్డి, సత్తి రామకృష్ణా రెడ్డి, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహిళల రక్షణకు కృషి

సీతంపేట : గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ గ్లోబల్ పింక్ ఆర్మీని సింధు మంగళవేద స్థాపించారని తెలిపారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పింక్ ఆర్మీ అవగాహన కల్పిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాదెళ్ల జ్యోతి, దీకప్ టాటర్ జైన్, శిడగం నాగేంద్రబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సీతాకోక చిలుకల పార్కు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో సీతాకోక చిలుకల పార్కు శిథిలావస్థకు చేరింది. గతంలో ఇక్కడ సందర్శకులను కనువిందు చేసిన వివిధ రకాల సీతాకోక చిలుకలు మాయమయ్యాయి. దీంతో సందర్శకులు వెళ్లకపోవడంతో ఈ పార్కు వెలవెలబోతోంది. సాధారణంగా జూ పేరు చెప్పగానే రకరకాల పక్షులు, ఎన్నో జాతుల జంతువులు గుర్తుకు వస్తాయి. జూకి వెళ్లే సందర్శకులకు వాటి నుంచి వినోదంతోపాటు విజ్ఞానం లభిస్తోంది. ఇక్కడ జూ అధికారులు మాత్రం సందర్శకులకు వాటితోపాటు మరింత వినోదం కోసం సీతాకోక చిలుకలను అందుబాటులోకి తీసుకురావాలని 2010లో బయోస్కోప్ సమీపంలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఎదురుగా సుమారు 1,000 చదరపు గజాల విస్తీర్ణంలో సీతకోక చిలుకల పార్కు ఏర్పాటు చేశారు. ఈ పార్కులో రకరకాల సీతాకోక చిలుకలను ఉత్పత్తి చేశారు. దీంతో ఇక్కడకు వెళ్లే సందర్శకులకు రంగురంగుల చిలుకలు కనువిందు చేసేవి. ఈ చిలుకలు బయటకు ఎగిరిపోకుండా ఇనుప మెస్‌తో పైకప్పు ఏర్పాటు చేశారు. దానిలో చిన్న రంధ్రాల నుంచి గాలి, వెలుతురు వెళ్లే ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది. ఈ పార్కు శిథిలావస్థకు చేరి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా జూ అధికారులు పట్టించుకోలేదు. దీని లోపల సందర్శకులను కనువిందు చేసే ఫౌంటైన్ మూగబోయింది. ఇప్పుడు ఆ ఫౌంటైన్ పని చేయడం లేదు. దాని చుట్టూ వివిధ రకాల పూల మొక్కలు, సీతకోక చిలుకలకు ఆహారం కోసం మధుర రసాలను ఇచ్చే మొక్కలు ఎండిపోయాయి. పార్కు పైకప్పు శిథిలమైంది. పైకప్పు మీద వేసే మెస్ పూర్తిగా చిరిగిపోయింది. దీని ద్వారానికి అమర్చిన మెస్‌ది కూడా అదే పరిస్థితి. ఈ పార్కు శిథిలం కావడంతో ఇందులో చిలుకలు బయటకు ఎగిరిపోయాయి. ఈ పార్కును పునర్నిర్మించాలని జూ అధికారులను సందర్శకులు కోరుతున్నారు.



జూలో శిథిలమై కళావిహీనంగా మారిన సీతాకోక చిలుకల పార్కు

గిరిజన ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

విశాఖ విద్య : ఏపీ రాష్ట్ర విద్యుత్ శాఖలో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ – 2025, క్యాలెండర్లు ఆదివారం ఆవిష్కరించారు. ఆంధ్ర యూనివర్సిటీ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎమ్.ధారునాయక్, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పూర్తి స్థాయిలో అమలు చేసేలా అసోసియేషన్ ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ఉదయ్ కుమార్, జనరల్ సెక్రటరీ డి.రాము, సంఘ నాయకులు బి.నాగేశ్వరరావు, ఎం.కృష్ణా నాయక్, ఎం.భానునాయక్, ఎల్.నరసింహ, టి.వెంకటేశ్వర్లు, ఎల్.మహేంద్రనాథ్, ఎం.లక్ష్మణరావు, జి.దాలిబాబు, కె.సత్యనారాయణ, కె.శోభన్ కుమార్, తొడన్న పాల్గొన్నారు.



గిరిజన ఉద్యోగుల డైరీ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అవగాహన పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అంశంపై కళాకారుడు వైకే రాజు తన కళా బృందం కళాకారులచే అవగాహన కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులు, కాలుష్యం, గుడ్డ, నార, పేపర్ సంచుల ఉపయోగం, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత విశాఖకు సంబంధించి ఈ కళాబృందం అవగాహన కల్పించనుంది. జానపద గీతాలతో ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ బృందం నగర నలుమూలల అవగాహన కల్పించనుంది. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.